## క్లుప్తంగా

### నూతన కార్యవర్గం ఎన్నిక



బాబురావు, అధ్యక్షుడు

ఖానాపురం : మండలంలోని రంగాపురం గ్రామంలో హనుమాన్ రైతు పరపతి, మార్కెటింగ్ సహాయ, సహకార పొదుపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తక్కళ్లపల్లి బాబురావు, ఉపాధ్యక్షుడిగా బందారపు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా మాచర్ల నరేశ్, సహాయ కార్యదర్శిగా మాచర్ల శ్రీనివాస్, కోశాధికారిగా పొద్దుటూరి వాసుదేవ్, సభ్యులుగా సంపత్‌రావు, వెంకన్న, ప్రవీణ్, శరభయ్యలు ఎన్నికయ్యారు.

### యూత్ సభ్యుల శ్రమదానం



నల్లబెల్లి : మండలంలోని కన్నారావుపేట నుంచి శనిగరం జాతీయ రహదారి వరకు వెళ్లే రోడ్డు గుంతలమయం కావడంతో కన్నారావుపేట ఫ్రెండ్స్ యూత్ సభ్యులు ఆదివారం శ్రమదానం చేసి రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చివేశారు. ఈ సందర్భంగా యూత్ అధ్యక్షుడు పల్నాటి మూర్తి మాట్లాడుతూ ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు శ్రమదానం చేసి గుంతలను పూడ్చినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో యూత్ కార్యదర్శి తండా సంపత్, సభ్యులు బొద్దిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, బందారి వర్దన్, పులి అన్వేష్, ననుప బద్రి, తండా రాజు, చార్ల కర్ణాకర్, మణికుమార్ పాల్గొన్నారు.

### వినీతకు డాక్టరేట్



వర్ధన్నపేట: మండలంలోని ల్యాబర్తికి చెందిన బడితపురం వినీత చైతన్య యూనివర్సిటీ నుంచి రసాయన శాస్త్ర విభాగంలో పరిశోధన పూర్తి చేసి శనివారం డాక్టరేట్ పట్టా సాధించింది. బడితపురం పద్మ–ఉపేందర్‌ల కూతురు వినీత చిన్నతనం నుంచి చదువుపై మక్కువ పెంచుకుంది. జఫర్‌గఢ్ ప్రభుత్వ గురుకుల పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్న ఆమె డిగ్రీ పూర్తి చేసింది. రసాయన శాస్త్ర విభాగంలో సింథసిస్ అండ్ బయోలాజికల్ ఎవాల్యుయేషన్ ఆఫ్ సమ్ నావల్ పైరాజోల్, తాలజైన్ అండ్ క్వినోక్సిలిస్ డెరివేటివ్స్ అండ్ దెయిర్ మాలిక్యులర్ డాకింగ్ స్టడీస్ అనే అంశంపై ప్రొఫెసర్ శ్రీనివాస్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసింది. హైదరాబాద్‌లోని చైతన్య యూనివర్సిటీలో డాక్టరేట్ పొందడంతో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, బంధువులు వినీతకు అభినందనలు తెలిపారు.

### మహ్మద్ ప్రవక్త బోధనలు ఆదర్శం



నల్లబెల్లి : మహ్మద్ ప్రవక్త బోధనలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎస్సై గోవర్ధన్ సూచించారు. పవిత్ర రంజాన్ మాసంను పురస్కరించుకొని ములుగు పట్టణానికి చెందిన మహ్మద్ చాంద్‌పాషా ఆదివారం నల్లబెల్లి మజీద్‌లో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పేదవారికి సాయపడాలనే ప్రవక్త సూక్తులను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకొని పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రంజాన్ మాసంలో శాంతి, సామరస్యానికి నిదర్శనంగా ముస్లింలు ఉపవాస దీక్ష చేయడం అభినందనీయమన్నారు. అంతకుముందు మత గురువు మహ్మద్ రషీద్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం పెద్దలు ఎండీ షబ్బీర్, నన్నేసాహెబ్, చాంద్‌పాషా, సద్దాం, అజ్జల్, నాసర్, నబీసాబ్, తదితరులు పాల్గొన్నారు.

### నీటి సమస్య తలెత్తకుండా చూస్తాం

రాయపర్తి : వేసవి సమీపిస్తున్న తరుణంలో మండలంలోని కేశవాపురం గ్రామంలో తాగు, సాగునీటి సమస్య తలెత్తకుండా పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఆదేశంతో చూస్తామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కేశవాపురంలో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడినట్లు తెలిపారు. సాగునీటి సమస్యను తీర్చేందుకు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మెర కల్యాణ్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు గుగులోతు శ్రీనివాస్, గ్రామశాఖ అధ్యక్షుడు సుధాకర్, రాజశేఖర్, సోమిరెడ్డి, నరేందర్, భాస్కర్, పాల్గొన్నారు.

# మండు వేసవిలో మత్తళ్లు

- జలకళను సంతరించుకున్న చెరువులు
- సంబురాలు చేసుకుంటున్న అన్నదాతలు



మత్తడి పోస్తున్న దుగ్గొండి పెద్ద చెరువు

దుగ్గొండి : మండు వేసవిలో చెరువులు మత్తళ్లు పోస్తున్నాయి. గొలుసుకట్టు పద్ధతిలో చెరువులు జలకళను సంతరించుకుంటున్నాయి. అన్నదాతలు, మత్స్యకారులు సంబురాలు చేసుకుంటున్నారు.

వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఎస్సారెస్పీ డీబీఎం 38, 40, 42 కాల్వల ద్వారా యాసంగి పంటలకు సాగునీటిని జనవరి 1 నుంచి వారం విడిచి వారం నీటిని సరఫరా చేస్తున్నారు. ఎస్సారెస్పీ జలాలతో జిల్లా వ్యాప్తంగా 79,180 ఎకరాలకు సాగునీరు అందుతుండగా ఒక్క నర్సంపేట నియోజకవర్గంలో 56 వేల ఎకరాలకు సాగునీరందుతోంది. 14 రోజులుగా డీబీఎం 38 కాల్వ ద్వారా నిరంతరాయంగా నీరు ప్రవహిస్తుండటంతో దుగ్గొండి మండలంలోని పలు చెరువులు జలకళను సంతరించుకుంటున్నాయి. మండల పరిధిలో ఎస్సారెస్పీ ఆయకట్టు కింద 1,450 ఎకరాలలో వరిపంట సాగు కాగా 7,800 ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగు చేశారు.

**గొలుసుకట్టు పద్ధతిలో నిండుతున్న చెరువులు.**

ఎస్సారెస్పీ డీబీఎం 38 కాల్వ ద్వారా వచ్చే నీటితో మండలంలోని పొనకల్ కొత్తచెరువు, వెంకటాపురం పెద్ద చెరువు, చిన్న చెరువు, దుగ్గొండి పెద్ద చెరువులు మత్తడి పోస్తుండగా పొనకల్ పెద్ద చెరువు, నాచినపల్లి ఊర చెరువు, లక్ష్మీపురం గణేష్‌చెరువు, మల్లంపల్లి మొండికుంట, పెద్ద చెరువు, మహ్మదాపురం వట్టెం చెరువు, తిమ్మంపేట గుండం చెరువులకు గొలుసుకట్టు పద్ధతిలో నీరు చేరుతుంది. ఆయా చెరువుల పరిధిలో 3350 ఎకరాల ఆయకట్టు ఉండగా నీరు సమృద్ధిగా వస్తుందో రాదోనని అనుమానంతో 2వేల ఎకరాల్లో వరి వేయలేదు. 1,350 ఎకరాల్లో వరిపంట వేశారు. 34 గ్రామాల పరిధిలో ఆయకట్టు కింద రైతులు మొక్కజొన్న, వేరుశనగ పంటలు సాగు చేశారు.



నీటితో కళకళలాడుతున్న చెరువు

**సంతోషంలో మత్స్యకారులు..**

చెరువులు వానాకాలం వలే జలకళను సంతరించుకుంటుండటంతో మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చెరువుల్లో వేసిన చేప పిల్లలు మరింత బరువు పెరిగి ఆర్థికంగా తోడ్పాటు లభిస్తుందని వారు అంటున్నారు. మండుటెండల్లో చెరువుల్లో నీరు ఉంటే గొర్రెలు, మేకలు, గేదెలు, ఆవులకు దాహం తీరినట్లు అవుతుంది.

**ఏప్రిల్ 15 వరకు సాగునీరు అవసరం**

ప్రభుత్వం సన్నధాన్యం సాగు చేస్తే క్వింటాకు రూ.500 ఇస్తుండటంతో అన్నదాతలంతా యాసంగిలో 70 శాతం వరకు సన్నధాన్యం సాగు చేశారు. అయితే దొడ్డు రకాల 120–125 రోజులకే చేతికి వస్తుండగా సన్నరకాలకు 130 నుంచి 140 రోజుల సమయం పడుతుంది. ఎస్సారెస్పీ నిబంధనల ప్రకారం మార్చి 31 వరకే నీటి సరఫరా ఉండనుంది. ఇలా అయితే మరో 15 రోజులు సాగునీరు ఎలా అని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఏప్రిల్ మొదటి వారం నుంచి 15 వరకు నీరు విడుదల చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

### ముందే తెలిస్తే సాగు చేసేవాళ్లం



ఎస్సారెస్పీ నీరు జనవరి మొదటి వారంలో కొంత తక్కువగా రావడంతో పూర్తి స్థాయిలో వస్తాయో రావో నని వరి సాగు చేయలేదు. పెద్ద చెరువు కింద ఉన్న ఆయకట్టులో 25 శాతం మాత్రమే ఒక తూము కింద సాగు చేశాం. మిగతా 75 శాతం మరో తూము కింద వేయకుండా వదిలేశాం. – కామిశెట్టి ప్రశాంత్, రైతు, దుగ్గొండి

### 15 వరకు నీరు విడుదల చేయాలి



పొలాలు అన్నీ నిండు పొట్టదశలోఉన్నాయి. మరో 20 రోజుల పాటు సమృద్ధిగా నీరు పెట్టాల్సి ఉంది. మార్చి 31కి ఎస్సారెస్పీ నీళ్లు బంద్ చేస్తే మరో 15 రోజులు పంటను కాపాడుకోవడం కష్టం అవుతుంది. అధికారులు, పాలకులు స్పందించి ఏప్రిల్ 15 వరకు నీరు విడుదల చేయాలి. – నర్సింహారెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు

### రైతుల నుంచి డిమాండ్

ఎస్సారెస్పీ జలాలపై ఆధారపడి వేరుశనగ, మొక్కజొన్న, సన్నరకం వరి సాగు చేశామని నీరు ఏప్రిల్ వరకు అవసరం ఉంటుందని చాలా మంది రైతులు నిత్యం ఫోన్ చేస్తున్నారు. రైతుల అభ్యర్థనను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం. రైతులు ఆరుతడి పంటలకు కేటాయించే నీటిని రంధ్రాలు చేసి చెరువుల్లో తరలించకూడదు. చివరి ఆయకట్టు వరకు నీరు అందే విధంగా సహకారం అందించాలి. – రామకృష్ణ, డీఈ

# నాచినపల్లిలో ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

దుగ్గొండి : వారంతా ఎక్కడెక్కడి నుంచో వచ్చారు. చదువులమ్మ తల్లి ఒడిలో చేరి పదేళ్ల పాటు కలిసి చదువుకున్నారు. అనంతరం ఎక్కడికో వెళ్లి స్థిరపడ్డారు. మళ్లీ 30 ఏళ్ల అనంతరం ఒక్క చోట కలిశారు. మూడు దశాబ్దాల బాల్యబంధాన్ని గుర్తు చేసుకున్నారు. మండలంలోని నాచినపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1994–95 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. నాటి గురువులైన తిరుపతిరెడ్డి, దేవకర్ణ, సదానందం, రమేష్‌బాబులను శాలువాలు, పూలమాలతో సన్మానించారు. కష్టాల్లో ఉన్న సహచరులకు అండగా నిలవాలని, పేద సహచరుల పిల్లల విద్యాభివృద్ధి కోసం పాటుపడాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సిద్దిపేట సీఐ బండి పూర్ణచందర్, గోవర్ధన్, రాజు, రవి, తిరుమల్, మహేందర్, కుమారస్వామి 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

### సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఐనవోలు : మండల కేంద్రానికి చెందిన నలుగురి లబ్ధిదారులకు రూ.1.4లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరు కాగా టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యంపై పూర్తి భరోసా కల్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భాస్కర్, సునీల్, సమ్మయ్య, కుమారస్వామి, సంపత్‌రెడ్డి, రహీంపాషా, రమేశ్, సుధాకర్ పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి పరామర్శ



పర్వతగిరి : యాకాంతం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దయాకర్‌రావు

పర్వతగిరి: మండల కేంద్రానికి చెందిన మాడుగుల యాకాంతం, దొనికెన ఐలమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, పాలకుర్తి బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదివారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి సంతాపం తెలిపారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల నాయకులు, మాజీ ఎంపీటీసీ చింతపట్ల మాలతిసోమేశ్వర్‌రావు, మాజీ ఎంపీటీసీ మాడుగుల రాజు, చీదురు తిరుపతి, నాగుల బాబు, కరిమిళ్ల దుర్గారావు, సోషల్ మీడియా మండల కన్వీనర్ బొట్ల భాస్కర్, వెంకటేశ్వర్లు, మురళి, అఖిల్, శ్రీనివాస్, శ్రీధర్, సాయిలు, యూత్ సోషల్ మీడియా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట : పట్టణంలోని 13వ వార్డుకు చెందిన ఆవుల ప్రవీణ్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఈ సందర్భంగా ఆ వార్డుకు చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు కడారు సత్యనారాయణ ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.3 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట బీసీ పవర్ రాష్ట్ర అధ్యక్షుడు ఆబోతు రాజుయాదవ్, డివిజన్ అధ్యక్షుడు బాల్నె సుభాష్, ఉన్నారు. అలాగే నర్సంపేట బీజేపీ కంటెస్ట్ ఎమ్మెల్యే అభ్యర్థి కంభంపాటి పుల్లారావు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి 50 కిలోల బియ్యం పంపిణీ చేశారు. పరామర్శించిన వారిలో బీజేపీ జిల్లా ప్రచార కార్యదర్శి బాల్నె జగన్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల రాము, జిల్లా అధికార ప్రతినిధి మల్యాల వినయ్‌కుమార్, కనుక గణేష్ ఉన్నారు.

రాయపర్తి: మండలంలోని కొలన్‌పల్లికి చెందిన బీజేపీ నాయకుడు వాసం ప్రశాంత్ తండ్రి యాదగిరి ఇటీవల మృతిచెందగా అతని కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర నాయకుడు కర్ర శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు.ఆయన బీజేపీ మండల అధ్యక్షుడు నూనె అనిల్, ప్రధాన కార్యదర్శి బూరుగు నవీన్, పెండ్యాల గణేష్, మంచాల సుమన్, జక్కుల సందీప్ ఉన్నారు.

# రైతు మేళాను సద్వినియోగం చేసుకోవాలి

నర్సంపేట/నర్సంపేట రూరల్/పర్వతగిరి/నెక్కొండ/ఖానాపురం/నల్లబెల్లి: వరంగల్ రంగశాయిపేట జీఎం కన్వెన్షన్ హాల్‌లో ఈనెల 25, 26, 27వ తేదీల్లో నిర్వహించే తెలంగాణ రాష్ట్రస్థాయి రైతు ఉత్పత్తిదారు సంఘాల మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయా మండల వ్యవసాయ అధికారులు టి.కృష్ణకుమార్, ప్రశాంత్‌కుమార్, రాజ్‌కుమార్, బోగ శ్రీనివాస్, బన్న రజిత, తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే రైతు మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఉత్పత్తులకు సంబంధించిన ప్రదర్శన స్టాల్స్, వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన, వివిధ ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేట్ కంపెనీల ఉత్పత్తులు, వివిధ రకాల వ్యవసాయ అనుబంధ పరికరాలు, పని ముట్లు ప్రదర్శన స్టాల్స్ ప్రదర్శించడం జరుగుతుందని పేర్కొన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఉద్దేశం, లక్ష్యాలు, విజయాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పొందే వివిధ బ్యాంకు లింకేజి పథకాలు, నిష్ణాతులైన శాస్త్రవేత్తల ద్వారా సాంకేతిక పరిజ్ఞానం అందించడం జరుగుతుందన్నారు.

# చదువుతోనే బాలికల అభివృద్ధి

- నర్సంపేట రీజనల్ కోఆర్డినేటర్ రాజ్‌కుమార్



పుస్తకాలు అందుకున్న విద్యార్థినులతో అతిథులు, ప్రిన్సిపాళ్లు

నర్సంపేట : బాలికల అభివృద్ధి చదువుతోనే సాధ్యమవుతుందని, మహాత్మ జ్యోతిబాపులే, సావిత్రిబాయి పూలే అడుగుజాడల్లో నడుస్తూ చక్కటి భవిష్యత్‌ను నిర్మించుకోవాలని నర్సంపేట రీజనల్ కోఆర్డినేటర్ రాజ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ప్రిన్సిపాల్ మంగ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి రాజ్‌కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ తన పూర్వ విద్యార్థులను సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనేలా భాగస్వాములను చేస్తూ ఎన్నో మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్న లీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, కవి, వక్త కాసుల రవికుమార్‌ను అభినందించారు. రవికుమార్, జాయిన్ హ్యాండ్స్ ఫౌండేషన్ బాధ్యులు మాట్లాడుతూ విద్య ద్వారానే వికాసం అన్నారు. చదువు, ఆటపాటల్లో చక్కటి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు లీడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాయిన్ హ్యాండ్స్ ఫౌండేషన్ సభ్యులు ఆంగ్ల వ్యాకరణ పుస్తకాలను బహూకరించారు. కార్యక్రమంలో నల్లబెల్లి, నెక్కొండ గురుకులాల ప్రిన్సిపాళ్లు మల్లయ్య, జయ శ్రీ, జాయిన్ హ్యాండ్స్ ఫౌండేషన్ సభ్యులు రంజిత్‌కుమార్, మనోజ్‌కుమార్, అనిల్, సందీప్, నాగరాజు, నర్సంపేట ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడాలి



సైకిల్ యాత్ర చేపట్టిన యువకులు రాథోడ్, రాజు

వర్ధన్నపేట : దేశంలో నానాటికి కాలుష్యం పెరుగుతున్నటువంటి సందర్భంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పరావ్యరణాన్ని కాపాడాలని కొత్తగూడెంకు చెందిన పందు రాథోడ్, రాజు సైకిల్ యాత్రతో భారతదేశ పర్యటనకు జాతీయ జెండాలను సైకిళ్లకు కట్టుకుని బయలు దేరారని ప్రముఖ యోగా గురువు పోశాల శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం కట్ర్యాల శివారు ప్రాంతంలో జాతీయ రహదారిపై వెళ్తున్న యువకులను ఆపి వారి నుంచి వివరాలు తెలుసుకుని భగవద్గీతలను అందించినట్లు శ్రీనివాస్ చెప్పారు. సోమవారం వేయిస్తంభాల గుడి, భద్రకాళి దేవాలయం, పద్మాక్షి దేవాలయం, ఖిలా వరంగల్ కోటలను సందర్శించి అక్కడికి వచ్చే పర్యాటకులకు పర్యావరణంపై అవగాహన కలిగిస్తారని తెలిపారు. నిత్యావసరాలకు డీజిల్, పెట్రోల్ వాహనాలను వాడకుండా ప్రతి ఒక్కరూ సైకిల్ వాడాలని సూచించినట్లు తెలిపారు.

# దాహార్తి తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు





చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి : ప్రజల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని బురహాన్‌పల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు కర్నూరి రత్నాకర్‌రెడ్డి సహకారంతో మండలకేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలో లేకపోయినా ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటానని చెప్పారు. అనంతరం మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు ఆలకుంట్ల వెంకన్న అనారోగ్యంతో చికిత్స పొందుతుండగా ఆయనను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహా నాయక్, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, మండల ప్రధానకార్యదర్శి పూస మధు, అధికారప్రతినిధి తాళ్లపెల్లి సంతోష్‌గౌడ్, గారె నర్సయ్య, ఐత రాంచందర్, బాలరాజు, రాము, ఎల్లస్వామి, యాదగిరి ఉన్నారు.

# భగత్‌సింగ్ స్ఫూర్తితో ముందుకు సాగాలి

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



నర్సంపేట : భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఖానాపురం: భగత్‌సింగ్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. భగత్ యువజన సంఘం ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 94వ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. నూతనంగా నిర్మించిన భగత్ కమ్యూనిటీ హాల్, మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం పోరాడిన గొప్ప వ్యక్తి భగత్‌సింగ్ అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్య, ఫార్మా ప్రొడ్యూసర్ కంపెనీ చైర్మన్ కత్తాల వెంకటేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట : భారత స్వాతంత్య్ర సమరంలో అమరవీరులైన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల త్యాగం మహోన్నతమైందని, నేటి యువత వారి ఆశయాల సాధనకై కృషి చేయాలని కవి, లీడ్ గ్రంథాలయాల ఉద్యమకర్త కాసుల రవికుమార్ అన్నారు. భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాడాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి గుర్రం అజయ్ అన్నారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సీపీఐ(ఎంఎల్) పార్టీ కార్యాలయంలో ఆది వారం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో లీడ్ గ్రంథాలయ సందర్శనకు వచ్చిన పెద్దపల్లి జిల్లా దూలకట్ల మాజీ సర్పంచ్ శ్రీనివాస్, శ్రీధర్, శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

**నవతరానికి భగత్‌సింగ్ మార్గదర్శి**

నల్లబెల్లి : భారత దేశ బానిసత్వ సంకెళ్లను తెంచేందుకు ఎనలేని పోరాటం చేసిన విప్లవవీరుడు భగత్‌సింగ్ నవతరానికి మార్గదర్శి అని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి అన్నారు. ఆ సంఘం ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ ఆవరణలో ఆదివారం భగత్‌సింగ్ 94వ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి ఎలకంటి రాజేందర్, పీవైఎల్ జిల్లా నాయకులు భిక్షపతి, రాజు, పీడీఎస్‌యూ డివిజన్ నాయకులు వంశీ, పవన్, అఖిల్, అక్షయ్, ప్రసాద్, మహేష్, ఐఎఫ్‌టీయూ డివిజన్ నాయకులు అశోక్, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు కృష్ణ, సారంగపాణి, భద్రాజీ పాల్గొన్నారు.



ఖానాపురం : భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి



నల్లబెల్లి: నివాళులర్పిస్తున్న బీసీ హక్కుల సాధన సమితి సభ్యులు

**అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలి**

గీసుకొండ: దేశ స్వాతంత్య్రం కోసం తమ ప్రాణాలను అర్పించిన రాజ్‌గురు, భగత్‌సింగ్, సుఖ్‌దేవ్‌ల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోనె కుమారస్వామి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సమరయోధుల వర్ధంతి కార్యక్రమంలో సుధాకర్, గూడ సురేశ్, మల్లయ్య, సదానందం, ప్రసాద్, నర్సయ్య, లలిత, భూమాత, పూలమ్మ తదితరులు పాల్గొన్నారు.



గీసుకొండలో..

### ఘనంగా కంఠమహేశ్వరస్వామి ఉత్సవాలు



కంఠమహేశ్వరస్వామి ఉత్సవాల్లో పాల్గొన్న గౌడ కులస్తులు

నర్సంపేట : చెన్నారావుపేట మండలం పాపయ్యపేటలో కంఠమహేశ్వరస్వామి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని గౌడ కులస్తులు కంఠమహేశ్వరస్వామి, సురమాంబదేవి, రేణుకా ఎల్లమ్మతల్లి, వనం మైసమ్మలకు బోనాలు సమర్పించారు. అనంతరం బిందెలలో నీటిని తీసుకెళ్లి జలాభిషేకాలు నిర్వహించారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు.